08-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ - ఇప్పుడు విదేహిగా అయ్యే అభ్యాసం చేయండి. వినాశనమయ్యే మీ దేహాన్ని ప్రేమించక, ఒక్క శివబాబానే ప్రేమించండి. "

ప్రశ్న :- ఈ అనంతమైన పాత ప్రపంచం పై వైరాగ్యంవచ్చినవారిగుర్తులు ఎలాఉంటాయి ?

జవాబు :- వారు ఈ కనులకు కనిపించే వాటిని చూస్తున్నా చూడనట్లు ఉంటారు. ఇదంతా సమాప్తమవుతుందని వారి బుద్ధిలో గుర్తుంటుంది, వీరందరూ మరణించే ఉన్నారు. మేము శాంతిధామము - సుఖధామాలకు వెళ్లాలని భావిస్తూ ఉంటారు. వారి మమకారం తొలుగుతూ పోతుంది. యోగంలో ఉంటూ ఎవరితోనైనా మాట్లాడుతూ ఉంటే, వారికి కూడా ఆకర్షణ కలుగుతుంది. జ్ఞాన నషా ఎక్కి ఉంటుంది.

పాట :- ఓం నమః శివాయ....

ఓంశాంతి. తండ్రి అంటున్నారు - మధురమైన పిల్లలూ, మీరు శివబాబాను తెలుసుకున్నారు. ఈ పాట పాడితే భక్తి మార్గమని అనిపిస్తుంది. భక్తి మార్గము వారు శివాయ నమః అని కూడా అంటారు. తల్లి - తండ్రి అని కూడా అంటారు. కానీ వారెవరో తెలియదు. శివబాబా నుండి స్వర్గ వారసత్వం లభించాలి. పిల్లలైన మీకు తండ్రి లభించారు, వారి నుండి వారసత్వము లభిస్తూ ఉంది. అందుకే మీరు తండ్రిని స్మృతి చేస్తారు. మీకు శివబాబా లభించారు, ప్రపంచానికి లభించలేదు. ఎవరికి లభించారో, వారు కూడా బాగా నడుచుకోవడం లేదు. బాబా ఆదేశాలు చాలా మధురమైనవి - ' ఆత్మాభిమాని భవ, దేహీ - అభిమాని భవ! ' వారు ఆత్మలతోనే మాట్లాడ్తారు. దేహీ - అభిమానులైన తండ్రి దేహీ-అభిమానులైన పిల్లలతో మాట్లాడ్తారు. వారు ఒక్కరే. ఇప్పుడు వారు మధువనంలో పిల్లలైన మీ జతలో కూర్చొని ఉన్నారు. తండ్రి చదివించేందుకు వచ్చారని పిల్లలైన మీకు తెలుసు. ఈ చదువును శివబాబా తప్ప ఇతరులెవ్వరూ చదివించలేరు. బ్రహ్మ గానీ, విష్ణువు గానీ చదివించలేరు. తండ్రే వచ్చి పతితులను పావనంగా చేస్తారు. అమరకథను వినిపిస్తారు. అది కూడా ఇక్కడే వినిపిస్తారు. అమరనాథ్‌లో వినిపించరు. ఇదే అమర కథ, సత్యనారాయణ కథ. తండ్రి అంటున్నారు - నేను మీకు వినిపిస్తున్నాను అనగా నేను ఇక్కడే ఉన్నాను కదా. మిగిలినవన్నీ భక్తిమార్గంలోని ఎదురు దెబ్బలు. సర్వుల సద్గతిదాత నిరాకారులైన రాముడొక్కడే. వారే పతితపావనులు, జ్ఞానసాగరులు, శాంతిసాగరులు. వారు వినాశన సమయం సమీపంగా ఉన్నప్పుడు వస్తారు. జగత్తుకంతా గురువు ఒక్క పరమపిత పరమాత్మ మాత్రమే అవ్వగలరు. వారు నిరాకారులు కదా. దేవతలు కూడా మనుష్యులే. కానీ వారు దైవీ గుణాలు కలిగిన

మనుష్యులైనందున వారిని దేవతలని అంటారు. మీకిప్పుడు జ్ఞానము లభించింది. జ్ఞాన మార్గంలో స్థితి చాలా స్థిరంగా, దృఢంగా ఉంచుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువగా తండ్రిని స్మృతి చేయాలి. విదేహీగా తయారవ్వాలి కనుక ఇక దేహమును ఎందుకు ప్రేమించాలి? బాబామీకు చెప్తున్నారు - శివబాబాను స్మృతి చేయండి. దీని కొరకు వీరి వద్దకు రండి. వీరు దాదాను కలుసుకునేందుకు వెళ్తున్నారని మనుష్యులు భావిస్తారు. కానీ శివబాబాను స్మృతి చేసి వారితో కలుస్తామని మీకు తెలుసు. అక్కడ ఉండేదే నిరాకార ఆత్మలు, బిందువులు. బిందువును కలుసుకోలేరు. కావున శివబాబాతో ఎలా కలుస్తారు? అందుకే "*ఓ ఆత్మలారా, స్వయాన్ని ఆత్మగా భావించి, మేము శివబాబాతో కలుస్తామని బుద్ధిలో ఉంచుకోండి*" అని అర్థం చేయించబడ్తుంది. ఇది చాలా గొప్ప రహస్యం కదా. చాలా మందికి శివబాబా స్మృతి ఉండదు. సదా శివబాబాను స్మృతి చేయండి అని బాబా అర్థం చేయిస్తున్నారు. శివబాబా మిమ్ములను కలుసుకునేందుకు వస్తారు. వారు మీ వారిగా అయ్యారు. శివబాబా ఇతనిలో ప్రవేశించి జ్ఞానము వినిపిస్తున్నారు. శివబాబా కూడా నిరాకార ఆత్మనే. మీరు కూడా నిరాకార ఆత్మలే. ఒక్క బాబా మాత్రమే పిల్లలకు '*నన్నొక్కరినే స్మృతి చేయండి*' అని చెప్పగలరు. అది కూడా బుద్ధి ద్వారా స్మృతి చేయాలి. మనము తండ్రి వద్దకు వచ్చాము. బాబా ఈ పతిత శరీరంలో వచ్చారు. మనము వారి ముందుకు వస్తూనే శివబాబా, మేము మీవారిగా అయ్యామని నిశ్చయంతో అంటాము. నన్నొక్కరినే స్మృతి చేస్తే మీ వికర్మలు వినాశనమౌతాయని మురళీలలో కూడా వింటారు. వీరు అదే పతిత పావనులైన తండ్రి అని మీకు తెలుసు. వారు సత్య-సత్యమైన సద్గురువు. ఇప్పుడు పాండవులైన మీకు పరమపిత పరమాత్మతో ప్రీతి బుద్ధి ఉంది. మిగిలిన వారందరి కి ఎవరో ఒకరితో విపరీత బుద్ధి ఉంది. శివబాబా వారిగా అయినవారికి అపారమైన సంతోషముండాలి. సమయం ఎంత సమీపానికి వస్తే అంత ఖుషీ ఉంటుంది. ఇప్పుడు మీ 84 జన్మలు పూర్తయ్యాయి. ఇది అంతిమ జన్మ. మనము మన ఇంటికి వెళ్తాము. ఈ మెట్ల(సీఢీ) చిత్రము చాలా బాగుంది. ఇందులో ఈ జ్ఞానమంతా స్పష్టంగా ఉంది. కావున పిల్లలు రోజంతా బుద్ధిని ఉపయోగించాలి. చిత్రాలు తయారు చేయువారు చాలా విచార సాగర మథనం చేయాలి. ఎవరు పెద్దగా ఉంటారో, వారి ఆలోచనలు నడుస్తూ ఉండాలి. సత్యయుగ శ్రేష్ఠాచారి దైవీ రాజ్యంలో 9 లక్షల మంది ఉంటారని మీరు ఛాలెంజ్ చేస్తారు. దీనికి ఋజువేమిటి ? అని ఎవరైనా అడుగుతారు. ఇది అర్థము చేసుకునే విషయం కదా. సత్యయుగంలో వృక్షము చాలా చిన్నదిగా ఉంటుంది. ధర్మము కూడా ఒక్కటే ఉంటుంది. కావున మనుష్యులు కూడా కొంతమందే ఉంటారు. మెట్ల చిత్రములో మొత్తం జ్ఞానమంతా వచ్చేస్తుంది. కుంభకర్ణుని చిత్రముంది కదా. బి.కెలుజ్ఞానామృతమును త్రాగిస్తున్నట్లు, వారు విషమును(వికారాలను) అడుగుతున్నట్లు చిత్రాన్ని తయారుచేయాలి.

బాబా మురళిలో ఆదేశాలు ఇస్తూ ఉంటారు. ప్రతీ చిత్రంలో వివరణ చాలా బాగుంది. వారికి లక్ష్మీనారాయణుల చిత్రమును చూపించి చెప్పండి - ఈ భారతదేశం ఒకప్పుడు స్వర్గంగా ఉండేది, ఒకే ధర్మముండేది కావున ఎంతమంది మనుష్యులుంటారు. ఇప్పుడు ఎంత పెద్ద వృక్షంగా అయింది! ఇప్పుడు వినాశనం జరగనున్నది. పాత సృష్టిని పరివర్తన చేయువారు ఒక్క తండ్రి మాత్రమే. ముఖ్యమైన 4-5 చిత్రాలు ఉండాలి. వీటి ద్వారా ఎవరికైనా వెంటనే బాణము తగలాలి. డ్రామానుసారం రోజురోజుకు జ్ఞాన పాయింట్లు గుహ్యమౌతూపోతాయి. కావునచిత్రాలలో కూడా మార్పు జరుగుతూ ఉంటుంది. పిల్లల బుద్ధిలో కూడా పరివర్తన జరుగుతూ ఉంటుంది. శివబాబా బిందువు అని ఇంతకుముందు మీకు తెలియదు. మొదట ఈ విధంగా ఎందుకు చెప్పలేదని అనేందుకు వీలు లేదు. తండ్రి అంటున్నారు-అన్ని విషయాలు మొదటనే తెలుపరు.తండ్రి జ్ఞానసాగరులు. కావున జ్ఞానము ఇస్తూనే ఉంటారు.కరెక్షన్ జరుగుతూ ఉంటుంది. మొదటనే తెలిపించరు. అలా తెలిపితే అది కృత్రిమంగా ఉంటుంది. అకస్మాత్తుగా ఏవైనా దుర్ఘటనలు మొదలైనవి జరుగుతూ ఉంటాయి.... డ్రామా అని అంటారు. ఇది జరిగి ఉండరాదని అనరాదు. మమ్మా చివరివరకు ఉండాల్సింది, మరి మమ్మా ఎందుకు వెళ్ళిపోయింది. డ్రామాలో ఏదైతే



జరిగిందో అదే సరైనది. బాబా కూడా ఏం చెప్పినా అదంతా డ్రామానుసారమే చెప్తారు. డ్రామాలో నా పాత్ర ఇలా ఉంది అని బాబా కూడా డ్రామా పై ఉంచుతారు. మనుష్యులు ఈశ్వరుని వ్రాత అని అంటారు. కానీ ఈశ్వరుడు, డ్రామా (విధి వ్రాత) అని అంటారు. ఈశ్వరుడు చెప్పినా లేక ఇతను చెప్పినా, డ్రామాలో ఉంది. ఏదైనా వ్యతిరేక కర్మ జరిగినా, అది కూడా డ్రామాలో ఉంది, తర్వాత అది రైటైపోతుంది. తప్పకుండా ఉన్నతి అయ్యే కళ జరుగుతుంది. పైకి ఎక్కునప్పుడు అప్పుడప్పుడు తొట్రు పడ్తారు. ఇవన్నీ మాయ కలిగించు తుఫానులు. మాయ ఉన్నంతవరకు వికల్పాలు తప్పకుండా వస్తాయి. సత్యయుగంలో

మాయే ఉండదు. కావున వికల్పాల మాటే ఉండదు. సత్యయుగంలో కర్మలు ఎప్పుడూ వికర్మలుగా అవ్వవు. ఇక కొద్ది రోజులు మాత్రమే ఉంది. ఇది మా అంతిమ జన్మ అని మీకు సంతోషముంటుంది. ఇప్పుడు అమర లోకంలోకి వెళ్లేందుకు శివబాబా ద్వారాఅమరకథను వింటున్నారు. ఈ విషయాలు మీరు మాత్రమే అర్థం చేసుకుంటారు. వారు అక్కడ అమరకథను వినేందుకు ఎక్కడకో వెళ్లి ఎన్నో ఎదురు దెబ్బలు తింటూ ఉంటారు. పార్వతికి కథ ఎవరు వినిపించారో వారికి తెలియదు. అక్కడ శివుని చిత్రాన్ని చూపిస్తారు. మరి శివుడు ఎవరిలో కూర్చున్నారు? శివుడు మరియు శంకరులను చూపిస్తారు. అంటే శివుడేమైనా శంకరునిలో కూర్చుని కథ వినిపించారా? కొంచెం కూడా అర్థముచేసుకోరు. భక్తిమార్గంలోని వారు ఇప్పటి వరకు తీర్థయాత్రలకు వెళ్తూనే ఉన్నారు. వాస్తవానికి కథ కూడా పెద్దదేమీ కాదు. ముఖ్యమైనది - మన్మనాభవ. బీజాన్ని స్మృతి చేస్తే చాలు. డ్రామా చక్రమును కూడా స్మృతి చేయండి. తండ్రి వద్ద ఏ జ్ఞానమైతే ఉందో అది మీ ఆత్మలోకూడా ఉంది. వారు జ్ఞాన సాగరులు. ఆత్మలైన మనము కూడా మాస్టర్ జ్ఞాన సాగరులము. నషా ఎక్కాలి కదా! వారు సోదరులమైన మనకు(ఆత్మలకు) వినిపిస్తారు. శరీరము ద్వారానే వినిపిస్తారు. ఇందులో సంశయం రాకూడదు. తండ్రిని స్మృతి చేస్తూ చేస్తూ మొత్తం జ్ఞానమంతా బుద్ధిలోకి వచ్చేస్తుంది. తండ్రి స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమౌతాయి, మమకారము నశిస్తూ పోతుంది. కొంతమంది ప్రేమ నామమాత్రంగా ఉంటుంది. మన ప్రేమ కూడా అటువంటిదే. ఇప్పుడు మనము సుఖధామంలోకి వెళ్తాము. ఇక్కడ అందరూ మరణించినట్లుగా ఉన్నారు. వీరి పై మనసునెందుకు పెట్టుకోవాలి! మనము శాంతిధామానికి వెళ్లి మళ్లీ సుఖధామంలోకి వచ్చి రాజ్యపాలన చేస్తాము. దీనినే పాత ప్రపంచంపై వైరాగ్యం అని అంటారు. తండ్రి అంటున్నారు - ఈ కనులతో మీరు చూచేదంతా సమాప్తం కానున్నది. వినాశనంతర్వాత స్వర్గాన్ని చూస్తారు. ఇప్పుడు పిల్లలైన మీరు చాలా మధురంగా తయారవ్వాలి. యోగంలో ఉండి ఏ మాట మాట్లాడినా ఎదుటి వారికి చాలా ఆకర్షణ కలుగుతుంది. ఈ జ్ఞానము ఎటువంటిదనగా మిగిలినవన్నీ మర్చిపోతారు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. జ్ఞాన మార్గంలో మీ స్థితిని చాలా శక్తివంతంగా చేసుకోవాలి. విదేహులుగా అవ్వాలి. ఒక్క తండ్రి పైన మాత్రమే సత్య-సత్యమైన ప్రీతి ఉండాలి.

2. డ్రామా నిర్ణయం పై స్థిరంగా ఉండాలి. డ్రామాలో జరిగినదంతా రైటే. ఎప్పుడూ అలజడి చెందరాదు. ఏ విషయంలోనూ సంశయపడరాదు.

వరదానము :- " దాతగా అయి ప్రతి సెకండు, ప్రతి సంకల్పంలో దానమిచ్చే ఉదారచిత్త్, మహాదాని భవ "

దాత పిల్లలైన మీరు తీసుకునేవారు కాదు, ఇచ్చేవారు. ప్రతి సెకండు,ప్రతి సంకల్పంలో ఇవ్వాలి. ఎప్పుడైతే ఇటువంటి దాతగా అవుతారో అప్పుడు వారిని ఉదారచిత్తులు, మహా దానులని అంటారు. ఇటువంటి మహాదానులుగా అయితే స్వతహాగా మహోన్నతమైన శక్తి ప్రాప్తిస్తుంది. కాని ఇచ్చేందుకు స్వంత భండారం నిండుగా ఉండాలి. ఏమేం తీసుకోవాలో అదంతా తీసుకున్నారు. ఇక మిగిలింది ఇవ్వడమే కనుక ఇస్తూ ఉండండి. ఇస్తూ ఉంటే భండారం ఇంకా నిండుతూ ఉంటుంది.

స్లోగన్ :- " ప్రతి సబ్జెక్టులో ఫుల్ మార్కులు జమ చేసుకోవాలంటే గంభీరతా గుణాన్ని ధారణ చేయండి. "



మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

1. నిరాకార పరమాత్మునికి బ్రహ్మ శరీరం రిజర్వు చేయబడింది (ప్రత్యేకించబడింది)

నిరాకార పరమాత్మ తన సాకార బ్రహ్మ శరీరంలో వచ్చి చదివిస్తున్నారని మీకు పూర్తిగా నిశ్చయముంది. ఈ పాయింటుపైన చాలా మంది జిజ్ఞాసువులు " అమృతవేళ సమయంలో నిరాకార పరమాత్మ మీ సాకార శరీరంలో ప్రవేశించినప్పుడు శరీరంలో ఏ

మార్పు వస్తుంది?నీవు ఆ సమయంలో పరమాత్మ ఎలా వస్తారో అనిచూస్తూ ఉంటావా? ” అని ప్రశ్నిస్తారు. పరమాత్మ ప్రవేశించే సమయంలో ఆ శరీరంలోని కనులు కదలికలు మారిపోవు. కాని మనము ధ్యానంలోకి వెళ్ళినప్పుడు కనులు, నడవడికలు మారిపోతాయి. కాని సాకార బ్రహ్మ పాత్రయే గుప్తమైనది.పరమాత్మ ఈ బ్రహ్మ శరీరంలో ప్రవేశించినప్పుడు, వారికి ఈ శరీరం రిజర్వు చేయబడిందని ఎవ్వరికీ తెలియదు. అందువలన ఒక్క సెకండులో వస్తారు, సెకండులో వెళ్ళిపోతారు. ఇప్పుడీ రహస్యాన్ని అర్థం చేసుకోవాలి. అంతేకాని ఏదైనా పాయింటు అర్థం కాకుంటే ఈ చదువును వదిలి వెళ్ళిపోరాదు. రోజురోజుకు ఈ చదువు గుహ్యంగా, స్పష్టంగా అవుతూ ఉంటుంది. పూర్తి కోర్సంతా ఒకే రోజులో చదవలేరు కదా. నిదానంగా మీకు అర్థం చేయించబడ్తుంది. ధర్మ పితలు ఎవరైతే వస్తారో, వారిలో కూడా, వారి వారి పవిత్రమైన ఆత్మ వచ్చి తన పాత్రను అభినయిస్తుంది. తర్వాత ఆ ఆత్మలు సుఖ-దు:ఖాల ఆటలో రావాలి. వారు తిరిగి వెళ్ళరు, కాని నిరాకార పరమాత్మ వచ్చినప్పుడు వారు సుఖ-దు:ఖాల నుండి భిన్నమైనవారు కనుక వారు కేవలం తమ పాత్రను అభినయించి వెళ్ళిపోతారు. ఈ పాయింటును మనం బుద్ధి ద్వారా అర్థం చేసుకోవాలి.

## 2. ఆత్మ మరియు పరమాత్మకు గుణాలు మరియు శక్తిలో గల భేదాలు

ఆత్మ మరియు పరమాత్మల రూపం ఒకే విధమైన జ్యోతి రూపం. ఆత్మ మరియు పరమాత్మల సైజు కూడా ఒక్కటే. పోతే ఆత్మ-పరమాత్మల గుణాలలో, శక్తిలో వ్యత్యాసం మాత్రం తప్పకుండా ఉంది. ఇప్పుడున్న ఈ గుణాలన్నిటి మహిమ పరమాత్మదే. పరమాత్మ సుఖ-దు:ఖాలకు భిన్నమైన (అతీతమైన) వారు, సర్వశక్తివంతులు, సర్వగుణసంపన్నులు, 16 కళా సంపూర్ణులు, వారి శక్తే మొత్తం పని అంతా చేస్తూ ఉంది. మనుష్యాత్మల ఏ శక్తీ పని చేయదు. మొత్తం పాత్ర అంతా పరమాత్మదే నడుస్తుంది. భలే పరమాత్మ పాత్ర చేస్తున్నా వారు స్వయం అతీతంగా ఉంటారు. ఆత్మ పాత్రలోకి వచ్చినప్పుడు పాత్రధారి రూపంలోకి వస్తుంది, కాని పరమాత్మ పాత్రలోకి వచ్చినా కర్మ బంధనం నుండి భిన్నంగా ఉంటారు. ఆత్మ పాత్రలోకి వచ్చినప్పుడు కర్మ బంధనానికి వశమౌతుంది. ఆత్మ మరియు పరమాత్మకు గల భేదమిదే. అచ్ఛా.

-: ఓంశాంతి :-